ప్రజాశక్తి
బుధవారం 2 ఏప్రిల్ 2025 5 అనంతపురం

పింఛన్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

పగ రగులుతోందా..?



- గ్రామాల్లో మొదలవుతున్న రాజకీయవేడి
- వచ్చేదంతా స్థానిక సంస్థల ఎన్నికల కాలం
- పోలీసులకు సవాల్‌గా శాంతిభద్రతల పరిరక్షణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయంటే ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతాయి. సాధారణ ఎన్నికల కంటే కూడా ఈ ఎన్నికల్లోనే ఆధిపత్యపు పోరు ఎక్కువగా ఉంటుంది. ఆయా గ్రామాల్లో పట్టు కోసం రాజకీయ ప్రయత్నాలు ముమ్మరమవుతూ ఉంటాయి. తాజాగా జరిగిన మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి. పూర్తి స్థాయి మెజార్టీ వైసిపికున్నా.. అధికారపార్టీ తన వైపు మండల పరిషత్‌ను తిప్పుకునే ప్రయత్నాలు సాగాయి. దీన్ని అడ్డుకునేందుకు వైసిపి అదే స్థాయిలో ప్రయత్నాలు చేయడంతో రామగిరి మండల పరిషత్ ఎన్నిక ఉద్రిక్తతలకు దారి తీసింది. దీనికి కొనసాగింపుగానే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురబ లింగయ్య హత్యకు గురైనట్టు వైసిపి ఆరోపిస్తోంది. ఇక కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట ఎన్నిక కూడా వాడివేడిగానే మారిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరికి పంచాయతీల పదవీకాలం ముగియనుంది. ఆ తరువాత మార్చికి మున్సిపాల్టీల గడువు ముగినుంది. ఇక వచ్చే ఏడాది సెప్టంబర్ నాటికి ఎంపిటిసి, జడ్పిటిసిల పదవీకాలం ముగియనుంది. అంటే మరో ఆరు మాసాల నుంచి వరుసగా స్థానిక సంస్థల పదవీకాలాలు పూర్తవడం ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ఈ ఎన్నికలు నిర్వహణ ప్రారంభమయ్యే అవకాశాలూ ఉన్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణకు సవాళ్లు తప్పవా. ?

స్థానిక సంస్థల ఎన్నికలంటేనే ఆధిపత్యపు పోరు ఉంటుంది. గ్రామాల్లో పట్టు కోసం ప్రయత్నాలు జోరుగా సాగుతాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్షన్ ఘర్షణలు చోటు చేసుకునే అవకాశాలుండనున్నాయి. వీటిని అరికట్టే విషయంలో పోలీసులు ఏ మేరకు సఫలీకృతమవుతారన్నది చూడాల్సి ఉంటుంది. ఇప్పుడు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల విషయంలో రామగిరిలో జరిగిన ఒక్క దానికే పూర్తి స్థాయిలో నియంత్రణ చేపట్టలేకపోయారన్న విమర్శలున్నాయి. అంతేకాకుండా ఒక హత్య కూడా జరగడం గమనార్హం. ఇక ఎన్నికలు జరిగితే అనేక ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు జరిగే అవకాశాలు లేకపోలేదని విపక్షాలు చెబుతున్నాయి. గతంలో చూసుకున్నా స్థానిక సంస్థల ఎన్నికలు కొన్ని నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలున్నాయి. ప్రధానంగా రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో గతం నుంచి ఫ్యాక్షన్ ప్రభావమున్న గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఏ రకమైన ముందస్తు చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. ఈ ప్రాంతాలు పోలీసులకు ఒక సవాల్‌గానే మారే అవకాశముంది. ఇప్పటికే తాడిపత్రి, రాప్తాడు నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య పరస్పరం ఘర్షణ వాతావరణమే నెలకుని ఉంది. అధికారపార్టీకి పూర్తి స్థాయిలో అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ ఈ రెండుచోట్ల వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు కూడా కొంత మంది అధికారులపై ఫిర్యాదులు చేసిన ఘటనలూ ఉన్నాయి. ఇవి ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్ది మరింతగా పెరిగే అవకాశాలూ లేకపోలేదని విశ్లేషకులు చెబుతున్నారు.

రాయదుర్గాన్ని అగ్రభాగాన నిలుపుదాం

ప్రభుత్వ విప్ కాలవ, కలెక్టర్ వినోద్‌కుమార్ తాళ్లకెరలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి రాయదుర్గం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అగ్రభాగాన నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట మండలం తాళ్లకెర గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, కలెక్టర్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం కళ్యాణమండపంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తాళ్లకెర గ్రామంలో సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, ఇళ్లు, పెన్షన్లు కావాలని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో సిసి రోడ్లు, మురుగునీటి కాలువల ఏర్పాటుకు రూ.1.47 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాళ్లకెర గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అంధులు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ ఆ కుటుంబానికి ఇళ్లు, నిబంధనలకు లోబడి పింఛన్లు మంజూరు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టెకు విప్, కలెక్టర్ భూమి పూజ చేశారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన పశువుల షెడ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, డ్వామా పీడీ సలీమ్ బాషా, జిల్లా పర్యటకశాఖ అధికారి జయకుమార్ బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, శ్రీరాములు, వెంకటేశులు, సదాశివ పాల్గొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

జిల్లాకు వర్షసూచన

4,5,6 తేదీలో ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాలో 4,5,6వ తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందనిబుక్కరాయసముద్రం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు తెలియజేశారు. ఈ మేరకు వ్యవసాయ వాతావరణం విభాగం సీనియర్ శాస్త్రవేత్త డా॥జి.నారాయణస్వామి, జికెఎంఎస్ రీసెర్స్ అసోసియేట్ డా॥జిడి.ఉమాదేవి, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డా॥.ఎల్.మాధవిలతలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 4, 5, 6వ తేదీల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షపాత సూచనలు ఉన్నాయన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 36.0-38.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 24.0-25.1 డిగ్రీల సెల్సియస్ నమోదు అవుతుందన్నారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6.0 - 7.0 కి.మీ॥ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు తేలికపాటి వర్షాల సూచనలున్న నేపథ్యంలో రైతులు పంటలు, పశువులు, గొర్రెలు, మేకల కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యాన పంటలు గాలుల తాకిడికి పడిపోకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వరి కోతలు ఉన్న రైతులు వాతావరణానికి అనుకూలంగా జాగ్రత్తలు తీసుకుని కోత దశలో ఉన్న పంటలను కోత యంత్రం సహాయంతో కోత కోసి భద్రపరుచుకోవాలని తెలియజేశారు.

నేడు, రేపు ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుటలో యాజమాన్యం విఫలమైందని పేర్కొంటూ బుధ, గురువారాల్లో ఆర్టీసీ డిపో వద్ద ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎర్రబాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు అసోసియేషన్ డిపో కార్యదర్శి హెచ్.తిప్పేస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై మార్చి 25వ తేదీ ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అయితే సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైనందున ఎపి పిటిడి ఎన్ఎంయుఏ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా 2, 3 తేదీల్లో ఆర్టీసీ డిపోల వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కావున రాయదుర్గం డిపో పరిధిలోని ఉద్యోగులు డిపో వద్ద ఉదయం 5 గంటలకే ఎర్ర బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టాలని పిలుపునిచ్చారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల వ్యాప్తంగా మంగళవారం నాడు ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. మండల కేంద్రంలో జరిగిన పింఛన్ల పంపిణీని ఎంపిడిఒ వాసు దేవర రెడ్డి పరిశీలించారు. స్వయంగా ఆయన పింఛన్‌దారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. అక్కమ్మ జాతర సందర్భంగా మంగళవారం దుర్గం ఛారిటబుల్ ట్రస్టు, ప్రాణదాత ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలో వేలాది మొక్కలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొక్కల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పండ్లు, నీడనిచ్చే మొక్కలను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. జాతరకు వచ్చిన భక్తులు మొక్కలను తీసుకెళ్లి నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎలుగు సురేష్‌కుమార్, కంబాల తిమ్మారెడ్డి, పాటిల్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని

గుర్తింపు సంఖ్య నమోదులో నిర్లక్ష్యం

ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలో రైతుల పేర్లను రిజిస్ట్రేషన్ చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రైతుకూ గుర్తింపు ఐడి ఇవ్వాలని కూటమి ప్రభుత్వం భావించి ఎఫ్ఆర్ (పార్మర్ ఐడి)కి శ్రీకారం చుట్టింది. ఈ ఐడి ద్వారానే ప్రభుత్వాలు అందించే పథకాలకు రైతులు అర్హులు అవుతారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, సబ్సిడీ ఎరువులు వంటి వాటికి ఈ ఐడితోనే ముడిపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే గత ఫిబ్రవరిలో సాంకేతిక సమస్యతో రైతు పట్టాదారు పాసు పుస్తకం ఖాతాలోని సర్వే నెంబర్ జనరేట్ కాలేదు. రెండు ఒటిపిలు వచ్చి మధ్యలో ఆగిపోయింది. దీంతో రైతులు నిరుత్సాహపడ్డారు. ఈనేపథ్యంలో తిరిగి మార్చి 21వతేదీ నుంచి సర్వర్ సమస్య పరిష్కరించి పార్మర్ ఐడి జనరేట్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యియి. మండలంలోని బొప్పేపల్లి, చిలమకూరు గ్రామాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండటం తేదని రైతులు వాపోతున్నారు. బొప్పేపల్లిలో 971 మంది రైతులకు కేవలం 80, చిలమకూరులో 524 మందికి 110 మందిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. ఈనేపథ్యంలో రిజిస్ట్రేషన్ చేసుకోని రైతుల్లో ఆందోళన నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము ప్రభుత్వ పథకాలకు ఎక్కడ అనర్హులం అవుతామో అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతధికారులు స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుని త్వరితగతిన రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెన్ననదిలో ఇసుకరేవు ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని కొండూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుకరేవు ఏర్పాటు చేయొద్దని కోరుతూ రైతులు తహశీల్దార్ ఉషారాణికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ పెన్నానది వల్లనే పొలాలతో పాటు కొండూరు, వీరన్నపల్లి, కొట్టాలపల్లి గ్రామాలకు నీటి సౌకర్యం కలుగుతోందన్నారను. ఇచ్చిన అనుమతులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుకరేవు ఏర్పాటు చేస్తే వ్యవసాయబోర్లలో నీరు అడుగంటిపోయి పంటలు పండక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. ఇసుకరేవు ఏర్పాటు చేస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యం అని హెచ్చరించారు.

బిల్లుల మంజూరుకు బ్రేక్..!

- ఆర్థిక సంవత్సరం చివరి రోజు వస్తాయని గుత్తేదారుల ఆశలు
- సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న వాటినీ వెనక్కు పంపిన ప్రభుత్వం
- నిలిచిన రూ.20 కోట్ల బిల్లులు
- ప్రభుత్వ నిర్ణయంతో ఖంగుతిన్న కార్పొరేషన్ కాంట్రాక్టర్లు
- అనంత అభివృద్ధి పనులపై నీలినీడలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా బిల్లులు పడతాయని ఎంతో ఆశగా ఎదురుచూసిన మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లకు మళ్లీ నిరాశే మిగిలింది. సోమవారం రాత్రి మూడు గంటల వరకు సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న బిల్లులు మంజూరు అవుతాయని కాంట్రాక్టర్లు ఎదురు చూసినా వారి ఆశ ఆడియాశే అయ్యింది. వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు నెలల తరబడి బిల్లులు మంజూరు కాకున్నా కాంట్రాక్టర్లకు ఊరటనిస్తూ ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు సాయంకాలం ఖాతాలకు బిల్లులు జమ అయ్యేవి. గతంలో మాదిరి ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా సోమవారం సాయంకాలం బిల్లులు పడతాయని మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు ఎదురుచూశారు. అలాంటిదేది జరక్కపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర నిరాశకు లోనయ్యారు. అనంతపురం కార్పొరేషన్‌లో గడచిన ఎనిమిది నెలల కాలంలో ఐదుగురు కమిషనర్ల పరిపాలన కాలంలో జరిగిన ఫైళ్ల ప్రాసెసింగ్ కోసం కాంట్రాక్టర్లు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే సమయంలో కోట్లాది రూపాయల బిల్లులు మంజూరు ఆగిపోయింది. బిల్లుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం డిడిఒకు ఆర్టికల్ 39, 50 ప్రకారం వెనక్కు తిప్పి పంపుతున్నట్లు ఆన్‌లైన్‌లో కనబరిచింది. ఇది చూసిన కాంట్రాక్టర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చిన్న పనులకు సంబంధించి కంటిన్‌జెన్సీ బిల్లులు సైతం వెనక్కి తిప్పి పంపారు. ఈ నిర్ణయంతో కార్పొరేషన్‌లో కనీసం చిన్న పనులు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి కన్పిస్తోంది. కార్పొరేషన్‌లో పరిస్థితి ఇలా ఉంటే రోడ్లు భవనాల శాఖలో బడా కాంట్రాక్టర్లు ఒక్కొక్కరికి రూ.25 కోట్లకు పైగా బిల్లులు మంజూరు అయ్యాయి. పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన నీరు ప్రగతి తదితర పనులకు ఐదేళ్ల క్రితం నాటి తెలుగుదేశం ప్రభుత్వంలోని పాత బకాయిలను మంజూరు చేసింది.

బిల్లుల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యంతో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల టెండర్లు నిర్వహించినా చేతిలో చిల్లిగవ్వలేక పనులు చేయటానికి కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపులో కొంతైనా బిల్లులు ఖాతాలకు జమ అయితే ఊపిరి పీల్చుకోవచ్చని భావించిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వ నిర్ణయం మరింత కష్టాల్లోకి నెట్టింది. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ప్రభుత్వ ప్రమేయం లేకుండానే స్థానికంగానే బిల్లులు మంజూరు చేసే అధికారం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు లభిస్తుందని ఇటీవల తెలియజేశారు. అయితే కార్పొరేషన్ అధికారులకు దీనిపై ఇప్పటి వరకు స్పష్టమైన ఆదేశాలు ఏవీ అందిన దాఖలాలు లేవు. చేసిన పనులకు సంబంధించి సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న బిల్లులు జారీ అవుతాయని గంపెడ ఆశ పెట్టుకున్న కాంట్రాక్టర్లకు బిల్లులు వెనక్కి తిప్పి పంపటం ఆశనిపాతంగా మారింది. బిల్లులు రాకపోవడంతో కార్పొరేషన్‌లో చిన్నపని కూడా చేయలేమంటూ గుత్తేదారులు అధికారులకు తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధిని కాంక్షించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

హంద్రీనీవా కాలువ గండిపడి పొలాల్లోకి వెళ్తున్న నీరు

హంద్రీనీవా కాలువ నుంచి వచ్చిన నీటితో మునిగిపోయిన వరిమడి

సోమందేపల్లి వద్ద హంద్రీనీవా కాలువకు గండి

వరి పొలాల్లోకి వెళ్లిన నీరు

ప్రజాశక్తి-సోమందేపల్లి

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పెద్దచెరువు సమీపంలోని కంకర ఫ్యాక్టరీ వద్ద హంద్రీనీవా కాలువకు మంగళవారం రాత్రి గండిపడి పడింది. దీంతో నీళ్లన్నీ సమీప పొలాల్లోకి వెళ్లాయి. విషయం తెలుసుకున్న హంద్రీనీవా అధికారులు మంగళవారం ఉదయం గండిపడిన కాలువను సందర్శించారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేసి నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. కాగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురానికి వెళ్తున్న హంద్రీనీవా కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో తరచూ ఎదో ఒక చోట గండిపడి నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. కాగా సోమవారం రాత్రి గండిపడి నీళ్లన్నీ సమీప వరి పొలాల్లోకి వెళ్లాయి. దీంతో నీటి ప్రవాహానికి వరిపొలాలు వంగిపోయాయి. ఇలా తరచూ హంద్రీనీవా కాలువ సమీపంలో నీళు బయటకు వచ్చి పంటలను నష్టపోతున్నామని, దీనిపై అధికారులు స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గండిని పూడ్చండి:మంత్రి సవిత

పెనుకొండ : సోమందేపల్లిలో గండిపడిన హంద్రీనీవా కాలువను వెంటనే పూడ్చాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె కలెక్టర్, నీటిపారుదల శాఖాధికారులతో మాట్లాడారు. కాలువ తెగడంతో నీరు రైతుల పొలాల్లోకి వస్తున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేయాలని సూచించారు.

అమృత్ భారత్ పథకంతో రైల్వే స్టేషన్ల అభివృద్ధి

గుంతకల్ రైల్వే డివిజన్‌లో 17 స్టేషన్‌లకు మరమ్మతులు - రైల్వే డిసిఎం శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతోందని, అందులో భాగంగా అనంతపురం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు గుంతకల్ రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం అనంతపురం రైల్వే స్టేషన్‌లోని మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనంతపురం రైల్వే డిఇ విల్సన్‌బాబు, సిఎస్ సూర్యనారాయణ, అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.అశోక్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. అమృత్ భారత్ పథకం ద్వారా గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని 17 రైల్వే స్టేషన్‌లకు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. రూ.446 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందులో అనంతపురం రైల్వేస్టేషన్‌కు రూ.29 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఫేస్-1 కింద చేసిన అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరు చేయగా ఖర్చుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఫేస్-2లో మరో రూ.10 కోట్లు మంజూరు అవుతాయని రెండు దశల్లో అనంతపురం రైల్వే స్టేషన్ అన్ని హంగులు, సదుపాయాలతో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణ సేవలు అందించేందుకు సిద్ధమైందన్నారు. ప్రయాణికులు, ప్రజలకు అనువుగా ఉండేలా ప్లాట్‌ఫాం నిర్మాణం, ఏసీ గదులు, నీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎస్కలేటర్‌లు, లిఫ్టలు, ప్లాట్‌ఫాం బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ధర్మవరం, కదిరి, గుత్తి, తాడిపత్రి తదితర రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల కేంద్రమైన గుమ్మఘట్టలో గ్రామ నాయకుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. కాలవ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. చలివేంద్రాన్ని వేసవి పూర్తయ్యే వరకూ నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

అనంతపురంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టిన కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా జడ్పీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకూ కొనసాగింది. సిఐటియు కార్యదర్శి వెంకట్ నారాయణ, ముర్తూజ, మున్సిపల్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం.నాగరాజు నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే కాంట్రాక్ట్ వ్యవస్థ రావడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. ఒకవేళ ఆప్కాస్‌ను రద్దు చేసిన పక్షంలో మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కరోనా సమ యంలో తీసుకున్న అదనపు కార్మికులకు రూ. 15వేల వేతనం చెల్లించాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు బకాయి సరెండర్ లీవులు చెల్లించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేశు, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, రాఘవ, ఇమాంబి, పెన్నా, నల్లప్ప, కమల్, శీన, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

గుంతకల్లు : మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కమిషనర్ నయీమ్ మహమ్మద్ స్పందించకపోవడంతో నాయకులు, కార్మికులు ఆయన ఛాంబర్ వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.నరసయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ పనిముట్లు లేకుండా కార్మికులు పారిశుధ్య పనులు ఎలా చేస్తారని కమిషనర్‌ను నిలదీశారు. కార్మికుల సమస్యలు, డిమాండ్లను ఏకరువు పెట్టారు. కమిషనర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కార్మికులపై దురుసు ప్రవర్తన మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్, నాయకుల మధ్య కాసేపు వాగ్వావాదం చోటుచేసుకుంది. కార్మికుల సమస్యలను పరిష్కరించలేకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జగదీష్, రంగనాయకులు, ఎర్రమ్మ, కృష్ణ, దాసు, శామ్యూల్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించా లన్నారు. 25 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను ఆప్కాస్ నుంచి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించ రాదన్నారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వన్నూరుస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, యూనియన్ నాయకులు తిమ్మప్ప, ప్రకాష్, అలివేలమ్మ, నటరాజ్, కార్మికులు పాల్గొన్నారు.

గుంతకల్లులో మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ఎదుట బైఠాయించిన కార్మికులు

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ

అట్టహాసంగా రాతిదూలం లాగుడు పోటీలు

హాజరైన ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు సమీపంలోని సుంకులమ్మ ఆలయం వద్ద మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథులు గా ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, జెసి.అస్మిత్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, జెసి పవన్‌కుమార్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించి తిలకించారు. విజేతలకు దాతలు పుట్లూరు పి.పుల్లారెడ్డి రూ. 60వేలు, కోమటికుంట్ల చావ్వా కులశేఖర్‌రెడ్డి(బాబు) రూ. 50వేలు, బి.పద్మనాభరెడ్డి, పి.పెదనాగిరెడ్డి రూ. 40వేలు, పతకమూరి రవికుమార్ రూ. 30వేలు, మానికింద వెంకటేష్ రూ. 25వేలు, తక్కళ్లపల్లి గోపాల్‌రెడ్డి రూ. 20వేలు, జక్కల రామాంజనేయులు రూ. 15వేలు, గోపరాజుపల్లి వెంకటసుబ్బారెడ్డి రూ. 12వేలు, వి.చంద్రమోహన్‌రెడ్డి రూ. 11వేలు, నంబూరి ప్రసాద్ నాయుడు రూ. 10వేలు, కొత్త పెండేకల్లు చంద్రశేఖర్‌రెడ్డి రూ. 6వేలు అందజేశారు. దూల దాత కొర్రగుంటపల్లి చంద్రశేఖర్‌రెడ్డి కమిటీ సభ్యులకు అందజేశారు. పోటీలు చూడడానికి వచ్చిన వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎల్‌కె.చెన్నారెడ్డి, పి.పుల్లారెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, కడవకల్లు గోవర్ధన్‌రాజు, చింతకుంట నాగేష్, శివారెడ్డి, రంగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలను తిలకిస్తున్న బండారుశ్రావణిశ్రీ, జెసి అస్మిత్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటశివుడుయాదవ్

పింఛన్ల పంపిణీ

మండలంలోని నాయకునిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ పింఛను దారులకు పింఛను సొమ్ము అందజేశారు. అనంతరం పుట్లూరులో పశువుల తాగునీటి తొట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, తహశీల్దార్ శేషారెడ్డి, ఎపిఒ నరేంద్ర, నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

ప్రజాశక్తి-శింగనమల

పశువుల సంరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని సర్పంచి దేగల లలితమ్మ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో మంగళవారం వారు నీటి తొట్టెల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పశువుల దాహార్తి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటి తొట్టెలు ఏర్పాటు చేయడం సంతోషదగ్గ విషయమన్నారు. వీటిని రైతులు, పశువుల కాపరులు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, టిడిపి నాయకులు ఓబుళపతి, ఆదిరెడ్డి, లక్ష్మయ్య, శివయ్య, నరసింహుడు, ఓబులేసు, మల్లికార్జున ప్రసాద్, వెంకటప్ప, వడ్డే రామాంజనేయులు, వడ్డే నల్లప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లో నీటితొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మండల టిడిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు ఎంపిడిఒ లక్ష్మీనారాయణ అధ్యక్షతన టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, తగ్గుపర్తి గ్రామంలో రాధాకృష్ణ ఎంపిపి పెద్దన్న, వెంకటనాయుడు, దుద్దేకుంట గ్రామంలో మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్టెలకు భూమి పూజ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధికంగా మండలానికి 93 నీటి తొట్టెలు మంజూరయ్యాయన్నారు. ఈ నీటి తొట్టెలు వేసవికాలంలో పశువులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. మల్లికార్జున మాట్లాడుతూ మూగజీవాల కోసం ప్రభుత్వం ఉపాధి హామీ కింద పశుగ్రాసం, పశువుల పాక, నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపిఒ మురళీకృష్ణ, టిఎలు స్వాతి, విజయ్, నాగేంద్ర, క్షేత్ర సహాయకుడు శివ, ప్రజలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : నీటితొట్టె ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

బ్రహ్మసముద్రం : ఉపాధి హామీ కింద మండలంలోని సూగేపల్లి గ్రామంలో సర్పంచి మల్లెల వనిత మల్లికార్జున నీటితొట్టె నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి శాంతి మంజు నాథ్, డీలర్లు శ్రీనివాసులు, నలమల్ల, టిడిపి నాయకులు అంకె ఓబులేసు, ఆనంద్, మఠం చంద్రశేఖర్, శంకరప్ప, నాగరాజు, మల్లికార్జున, నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ అంకె ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి -అనంతపురం

వెన్నపూస రవీంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం వెన్నపూస ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డి స్ఫూర్తితో ఏటా ఆయన జన్మదినం సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెన్నపూస సోదరులు నరేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, సంజీవరెడ్డి, మదన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న వెన్నపూస ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

ప్రధానోపాధ్యాయుడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆత్మకూరు

పదో తరగతి పరీక్ష రాస్తున్న గిరిజన విద్యార్థిని శ్రావణిని చేయి విరిగేలా చితకబాదిన స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసప్రసాద్ పై మంగళవారం ఇటుకలపల్లి సిఐ హేమంత్ కుమార్‌కు గిరిజన సంఘం నాయకులు శివశంకర్ నాయక్, మల్లికార్జుననాయక్ ఫిర్యాదు చేశారు. వారు మాట్లా డుతూ పరీక్ష కేంద్రంలో హెచ్ఎం కర్రతో బాలికను విపరీతంగా కొట్టడం వల్ల చేయి విరిగిందని, దీంతో ఆ బాలిక పరీక్ష రాయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసు అధికారులు తక్షణం హెచ్ఎంపై చైల్డ్ యాక్ట్, పోక్సో, ఇతర కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. లేనిచో గిరిజనులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సిన వస్తుందన్నారు. విద్యాశాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో హెచ్ఎంను కాపాడాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచి కృష్ణానాయక్, రాజానాయక్, ధనుంజయనాయక్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

హెచ్ఎంపై ఫిర్యాదు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

బిటిపికి నీరు తీసుకొస్తాం : విప్ కాలవ, ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

సిఎం చంద్రబాబు సహకారంతో బిటిపికి తప్పకుండా నీరు తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మండలంలోని మోరేపల్లి గ్రామంలో మంగళవారం చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో హిందూపురం ఎంపి పార్థసారధి, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్.రాజు పాల్గొన్నారు. ముందుగా వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వారు తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పింఛనుదారులకు నగదు అందజేశారు. అనంతరం ఎస్ఆర్‌సి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధ జలయంత్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్ఆర్‌సి ట్రస్ట్ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోనూ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అమిలినేనిని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, తహశీల్దార్ భాస్కర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపి పార్థసారధి, విప్ కాలవ, ఎమ్మెల్యే అమిలినేని, తదితరులు

ఘనంగా మారెమ్మ జాతర

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని బండూరు గ్రామంలో వెలసిన మారెమ్మ జాతరను మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి వడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామ వీధుల గుండా ఊరేగించారు.

నేడు తిక్కయ్యస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో బుధవారం తిక్కయ్యస్వామి ఉట్లమాను పరస నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిక్కయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి మండలం నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. ఈ సందర్భంగా చెక్కభజనలు, కోలాటం, ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం శివాలయం ముందు టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్(బాబు) ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేస్తారు.

వనభోజనాలకు వెళ్లిన ముస్లింలు

ప్రజాశక్తి-నార్పల

నెల రోజుల కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లింలు సోమవారం ఈదుల్ ఫితర్(రంజాన్) పండగ ముగియడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మంగళవారం సమీప ఉద్యానవనాలు, తోటల్లోకి వనభోజనాలకు వెళ్లారు. మధ్యాహ్న భోజనానంతరం పిల్లలు, పెద్దలు, యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు నీళ్లు చల్లుకుంటూ వసంతోత్సవాల్లో మునిగి తేలారు. వారు మాట్లాడుతూ నెల రోజుల నుంచి ఉపవాసాలు ఉండి దైవస్మరణలో గడిపిన తాము కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనాలకు వెళ్లి వనభోజనాలు చేసి వసంతోత్సవాలు జరుపుకున్నట్లు తెలిపారు.

దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కుందుర్పి

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం మండలం లోని బసాపురం గ్రామానికి చెందిన దళిత గోవిందరాజులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు.. గత ఆదివారం వ్యవసాయ పనులు ముగించుకొని బి. కొత్తూరు నుంచి బసాపురం వస్తుండగా మార్గమధ్యలో మాయదార్లపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తం, మల్లి, రవి కులం పేరుతో దూషిస్తూ దాడికి ప్రయత్నించారన్నారు. అదేరోజు రాత్రి మరోమారు వారు ఇంటి వద్దకు వచ్చి తనపై దాడి చేయడంతో పాటు ఇంట్లోని మహిళలపై బెదిరింపులకు పాల్పడుతూ అసభ్యంగా ప్రవర్తించారన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, లేనిచో పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సాకే గురుమూర్తి హెచ్చరించారు.

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు ప్రవహించేలా హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ శ్రీనివాసులుకి వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కావున హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఇప్పటికే ఈ ప్రాంత రైతులు అనావృష్టి, అతివృష్టి వల్ల చాలా నష్టపోయారని, కావున ఎన్నికల హామీ మేరకు సిఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి నీరందించాలన్నారు. అలాగే పిల్ల కాలువల ద్వారా రాగులపాడు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాలకు తాగు, సాగునీరందించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గిలి రమేష్, సురేంద్ర పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రాము నాయక్, ఈరన్న, డానియల్, కిష్టప్ప, ఖాదర్, రామయ్య, జాషువా పాల్గొన్నారు.

ఆర్‌డిఒ శ్రీనివాసులుకి వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని 17వ వార్డు, కేరమ్మకట్ట కాలనీ పరిధిలో మంగళవారం వడదెబ్బపై అవగాహన, సిడి, ఎన్‌సిడి సర్వే నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎండ వేడి ఎక్కువగా పెరగడం వల్ల కలిగే వడదెబ్బ వివిధ ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు అన్నారు. కావున వడదెబ్బ లక్షణాలను త్వరగా గుర్తిస్తే సురక్షితంగా ఉండటానికి, తీవ్రమైన అనారోగ్య సమస్యలను నివారించడానికి వీలవుతుం దన్నారు. పెదవులు పొడిగా ఉండటం, నోరు జిగురుగా ఉండటం, అధిక దాహం, బలహీనత, తల తిరుగుట, వికారం, వాంతులు, చిన్న కురుపులు, కండరాల నొప్పులు, ముక్కు నుంచి రక్తం కారుట వంటి తేలికపాటి లక్షణాలు ఉంటే చల్లటి ప్రదేశానికి చేరి కొబ్బరి నీళ్లు, ఎక్కువ ద్రవాలు తీసుకోవాలన్నారు. మగతగా ఉండటం, మూర్ఛ, కోమా, 2 గంటలకు పైగా 104 డిగ్రీల సెంటీగ్రేడ్ శరీర ఉష్ణోగ్రత ఉండటం, 8 గంటలకు పైగా మూత్రం రాకపోవడం వంటి తీవ్రమైన లక్షణాలు ఉన్నపుడు చల్లటి ప్రదేశానికి చేర్చి చల్లటి నీటితో స్నానం చేయించడం లేక మెడ, చంకలు, గజ్జల్లో ఐస్ వాటర్ టవల్‌ను ఉంచాలన్నారు. ఎటువంటి మార్పు లేకుంటే సమీప ఆసుపత్రికి చేర్చాలన్నారు. బయటికి వెళ్లినప్పుడు టోపీ, తెల్లటి దుస్తులు ధరించాలన్నారు. రోజుకు 5 లీటర్ల నీరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి ప్రమీల, ఆశా కార్యకర్త పద్మ, ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగవ్వాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో పారిశుధ్యం రోజురోజుకి అధ్వానంగా మారుతుందని పలు వార్డుల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అన్ని వార్డుల్లో పారిశుధ్యం మరింత మెరుగవ్వాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప తెలిపారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం పారిశుధ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, పారిశుధ్య విభాగం మేస్త్రీలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, అన్ని వార్డుల్లో సక్రమంగా ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయాలని, పారిశుధ్య సమస్యలు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పురపాలక సంఘంలో ఆస్తి, ఖాళీ స్థలం, నీటి పన్నుల వసూలులో రెండో స్థానం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్లు, అమినిటీస్, రెవెన్యూ సెక్రటరీలు, నీటి సరఫరా విభాగం సిబ్బందిని అభినందించారు.

ఆర్‌డిఒ శ్రీనివాసులుకి వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-నార్పల

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మండల వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన సోషల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి తెలిపారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మొత్తం 714 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఆఖరి పరీక్ష ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా రంగులు చల్లుకొని ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకొన్నారు. స్థానిక సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న పలువురు విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి సొంతూర్లకు వెళ్లారు.

శింగనమల : మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఇఒ నరసింహరాజు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆర్‌డిఒ కేశవనాయుడు, తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, సిట్టింగ్ స్క్వాడ్ నారపరెడ్డి సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కెజిబివిలో 140 మందికి ఒకరు, జడ్పీ హైస్కూల్‌లో 293 మందికి ఒకరు గైర్హాజరైనట్లు ఎంఇఒ తెలిపారు.

బొమ్మనహాల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మండల వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన సోషల్ పరీక్ష సజావుగా ముగిసిందని ఎంఇఒ మల్లికార్జున తెలిపారు. 4 కేంద్రాల్లో 880 మందికి గానూ 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

యల్లనూరు : మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలు మండలంలో ప్రశాంతం గా ముగిశాయని ఎంఇఒ-2 పరమేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం నాడు జరిగిన సాంఘిక శాస్త్రం చివరి పరీక్షకు మండలంలోని చిలమకూరు ఆదర్శ పరీక్ష కేంద్రంలో 305 మంది విద్యార్థులకు గాను 297మంది పరీక్షలు రాశారన్నారు. ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

శింగనమలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE :ANANTHAPURAMU
O.S. No:1518/2019

Between:
K.Lakshmi Devi ...Plaintiff
And
Y.Mallikarjuna Reddy and Others ...Defendants
Notice to Defendant No:2
D2: Guvvala Hanumantha Reddy
S/o G.Venkata Reddy, R/o D.No:18-882,
Neeruganti Street, Old Town, Ananthapur.
ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలో వాది దావా షెడ్యూలు దాఖల ఆస్తిలో డిక్లరేషన్‌కు మరియు Consequential injunction కు గాను పై దావా దాఖలు చేసి యున్నారు. సదిరి విషయముపై మీకు ఏమైన ఆక్షేపణలున్న యెడల మీరు 17-04-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
C.Rameshnatha Reddy,
Advocate, Tadipatri.
C.Surendranatha Reddy,
Advocate, Ananthapuram.

IN THE COURT OF II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT BALLARI
O.S.NO.291/2024
Between:
Smt. Shanthamma @ Nagarathnamma and another. ...Plaintiffs
And
1. Veerabhadra Reddy and others. ...Defendants
SUMMONS
To
Defendant No.4
Smt.Lakshmi Devamma
W/o Late V.Ramachandra Reddy
Aged about 79 years
R/o Kasapuram village, Gooty taluk
Guntakal mandalm, Ananthapura district, A.P
WHEREAS the above named plaintiffs have filed the above suit against you and other defendants seeking partition and separate possession of the schedule property. You are hereby summoned to appear this court in person or by a pleader duly instructed and able to answer to all material questions relating to the suit, on 28-04-2025 at Ballari, 11-00 clock, in the morning to answer the claim and you are. directed to produce on that day all the documents upon which you intend to deny in support of your defence.
Take notice that in default of your appearance on the day before mentioned suit will be heard and determined in your absence.
Given under my hand and seal of the court on this 28th day of March 2025.
By Order of the Court,
(R.Huliraj)
Advocate for plaintiffs
II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT BALLARI

వర్గీకరణపై జగన్ వైఖరి స్పష్టం చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఎస్సీ వర్గీకరణపై వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తన వైఖరిని స్పష్టం చేయాలని ఎమ్మా ర్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ ఆధ్వర్యంలో మంగళ వారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ న్యాయమైందని, వర్గీకరణ చేసే అధికారం ఆయా రాష్ట్రాలకు ఉందని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో దేశంలోని అన్ని వర్గాలు, అన్ని పార్టీలు ముక్తకంఠంతో స్వాగతించగా, మాజీ సిఎం జగన్ మాత్రం పెదవి విప్పలేదన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ విషయంలో కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణపై విమర్శలు చేయడం సబబు కాదన్నారు. కొందరు దళారులను పోగు చేసుకుని మాదిగ జాతిని విచ్ఛిన్నం చేయాలని చూస్తే మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దళితులపై ప్రేమ ఉంటే ఇకనైనా వర్గీకరణపై జగన్ మీడియా ఎదుట తన వైఖరి స్పష్టం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఎస్‌పి జాతీయ నాయకులు కెబి మధు, జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పలక ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు మారెప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, యువసేన జిల్లా అధ్యక్షులు శీను, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఓబులేష్, పెద్దపప్పూరు వాసు, భూపతి, పామిడి లాలప్ప పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉరవకొండను కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రబీ సీజన్‌లో జిల్లాలోనే అత్యధికంగా రైతులు మండలంలో పప్పుశనగతో పాటు ఇతర పంటలు సాగు చేశారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఉరవకొండ లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు అనేక కష్టాలకు గురవుతున్నారని తెలిపారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో, రైతు భరోసా మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కేంద్ర బృందం పర్యటించి 17 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి రూ. 37 కోట్ల పంట నష్ట పరిహారం విడుదల చేయగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ డబ్బులను రైతులు ఖాతాల్లో జమ చేయలేదన్నారు. నియోజకవర్గంలోని మిగిలిన మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు రాకెట్ల అశోక్, బసవరాజు, మండల కన్వీనర్ ఎర్రిస్వామిరెడ్డి, వైస్ ఎంపిపి ఈడిగ ప్రసాద్, మండల సమన్వయకర్త ఓబన్న, పార్టీ అనుబంధ రైతు సంఘం నాయకులు సిద్ధార్థ, వేమన్న, మహానంది, వార్డు సభ్యులు శర్మాస్, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పెద్దపప్పూరు : మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, కుమ్మెత నరసాపురం, చీమలవాగుపల్లి, తదితర గ్రామాల్లో రైతులు పప్పుశెనగ సాగు చేయగా సరైన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున ఎమ్మెల్యే అధికారుల నుంచి సమాచారం సేకరించి వెంటనే గ్రామాల్లో పర్యటించి పంట నష్టం తెలుసుకుని మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేలా ప్రభుత్వం, కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను పాలకులు, అధికారులు గుర్తించి వారి సమస్యలను పరిష్కరించి నష్టపరిహారం అందించేలా కృషి చేయాలని ఎపి రైతు సంఘం తరపున రాజారామిరెడ్డి, దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.